
VICTORY

విక్టరీ

# గయోపాఖ్యానం



# గయోపాఖ్యానము

✍

డా॥ జి.వి.పూర్ణచంద్

వెల : 30/-

## ప్రచండ యాదవ నాటకం

# గయోపాఖ్యానము

చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు గొప్ప సంఘసంస్కర్త. వీరేశలింగం పంతులుగారి తోటివాడు.

గొప్ప హాస్య రచయిత. అనేక ప్రహసనాలు రాశారు. నవలా రచయిత. నాటకకర్త.

ఈయన రచించిన గయోపాఖ్యానం నాటకం తెలుగులో అత్యధిక కాపీలు అమ్ముడుపోయిన నాటకాలలో మొదటిది. 1889లో ఈ నాటకాన్ని ఆయన రాశాడు. 1909లో పుస్తకరూపంగా వెలువడే నాటికే అనేకసార్లు ప్రదర్శించబడి ప్రసిద్ధిపొందింది.

ఇదీ, గురజాడవారి కన్యాశుల్కం ఇంచుమించుగా ఒకేసారి వెలువడ్డాయి. వసురాయ కవిగారి వేణీసంహారం, వేదం వెంకటరాయ శాస్త్రిగారి ప్రతాప రుద్రీయం, శ్రీపాదవారి బొబ్బిలి యుద్ధం ... ఇవన్నీ ఒక కాలంలో వెలువడిన తెలుగు నాటకాలు. వాటిలో కన్యాశుల్కం, గయోపాఖ్యానం ఎక్కువ ప్రదర్శనలు పొందాయి.

కన్యాశుల్కం ప్రదర్శించడానికి కొంత ఇబ్బంది వుంది. పౌరాణిక నాటకాలకు ఖర్చు ఎక్కువైనా గయోపాఖ్యానమే ఎక్కువ ప్రదర్శనలు పొందిందని చెప్తారు.

విశేషం ఏమంటే చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు తన 20వ ఏటనే హిందూ నాటక సమాజం వారి కోసం ఈ నాటకాన్ని రాశారు. "ప్రచండ యాదవ నాటకం" అనే మరో పేరు కూడా దీనికుంది.

ఇమ్మానేని హనుమంతరావు అనే సంస్కర్త హిందూ నాటక సమాజం నెలకొల్పారు. ఈ సమాజం కోసం చిలకమర్తి వారు కీచక వధ, ద్రౌపదీ పరిణయం, గయోపాఖ్యానం, శ్రీరామ జననం, పారిజాతాపహరణం – ఇలా చాలా నాటకాలు తయారుచేసి ఇచ్చారు.

అర్జునుడూ, కృష్ణుడూ ఒకరినొకరు దెప్పిపొడుచుకునే సంభాషణలు ఈ నాటకంలో అత్యద్భుతంగా కన్పిస్తాయి. సమర్థవంతులైన నటులైతే నిజంగానే పోటీపడి నటించేవారు. నాటక సమాజాలు కూడా పోటీలు పెట్టి అర్జునుడికో, కృష్ణుడికో బంగారుపతకం ఇచ్చేవారు.

ఈ నాటకం వెలువడే నాటికి తిరుపతి వేంకటకవుల ఉద్యోగ విజయాలు వెలువడలేదు. ఉద్యోగ విజయాల్లో – "బావా ఎప్పుడు వచ్చితీవు", "అలుగుటయే ఎరుంగని" వంటి పద్యాలు జనసామాన్యంలో బాగా ప్రసిద్ధిపొందాయి. అయితే అప్పటికే

*"అల్లుడా రమ్మని ఆదరమ్మున బిల్వ*
*బంపు మామను బట్టిచంపగలమే"*

వంటి పద్యాలు తెలుగు ప్రజలందరికీ కంఠతా వచ్చు.

సామాన్య మానవుల్లో సహజంగా వుండే రాగద్వేషాలు – పంతాలు, పట్టింపులూ కృష్ణార్జునుల పాత్రకు ఆపాదించి కల్పించడం వలన జన హృదయాలకు ఈ నాటకం హత్తుకొనిపోయింది. దేవుడి పాత్రలు కూడా సామాన్య మానవుడిలా ప్రవర్తిస్తున్నప్పుడు సామాన్యుడు ఆశ్చర్యంగానూ, ఉత్సాహంగా చూస్తాడు. జీవితానికి దగ్గరగా వుండటం అంటే అదీ ! చిలకమర్తివారు దాన్ని సాధించారీ గయోపాఖ్యానం నాటకంలో !!

తెలుగువారి ప్రత్యేకతలు గయోపాఖ్యానము, పారిజాతాపహరణమూ రచనలు. ఇవి తెలుగువారి జాతీయసంపద అంతే !

## 1

# యమునా తీరంలో బృందావనం

శ్రీకృష్ణుడు, బలరాముడు సకుటుంబ సపరివార సమేతంగా బృందావనం వచ్చారు. అక్కణ్ణించి వ్రేపల్లెలో చిన్నప్పుడు తాను పెరిగిన ఇంటికి వచ్చి నంద యశోదల్ని చూడాలని ఈ ప్రయాణం. ఇక్కడ యమునా నదిలో కాలకృత్యాలు నిర్వర్తించి, తన భార్యలతో కలిసి జలకాలాడాలని ఆయన కోరిక.

సూర్యోదయ సమయంలో ప్రభాకరుడికి విధి విధానంగా అర్ఘ్యప్రదానం చేసి అక్కడి నుంచి పెంచిన తల్లిదండ్రుల దర్శనానికి వెళ్ళాలనేది కార్యక్రమం.

తెల్లవారుఝామున నాలుగ్గంటలకే అందరినీ నిద్రలేపి కాళిందీ మడుగులో స్నానానికి సన్నాహాలు చేసే బాధ్యత సాత్యకికి అప్పగించాడు కృష్ణుడు.

సరిగ్గా నాలుగ్గంటలకి మంగళ తూర్యారవాలు మొదలుపెట్టారు. ఒక్కొక్కరే మేలుకోసాగారు.

కృష్ణుడి చెలికాడు కౌశికుడు బద్ధకంగా నిద్రలేచి వస్తుంటే, సాత్యకి ఎదురై రుక్మిణీ సత్యభామలను నిద్రలేపే పనిని ఆయనకు అప్పగించాడు.

రుక్మిణీదేవి గుడారం ముందు పరిచారిక "హంస పదిక" ఇసుకతిన్నెల్లో మంచం వేసుకుని పడుకొని వుంది. కౌశికుడు ఆమె మంచంకింద దూరి, కుక్కలాగా భౌభౌమని అరిచాడు. ఆ అరపుకు ఆమె మేల్కొంటుందని పాపం అతని ఉద్దేశ్యం.

కుక్కలాగా మొరిగి నిద్రాభంగం చేసిన కౌశికుణ్ణి కుక్క కాదు – కౌశికుడేనని గుర్తించి కూడా, కావాలని హంసపదిక ఆ మంచం కిందే అతన్ని కుదేసి చావబాదింది !

ఆ దెబ్బలకు అతను తట్టుకోలేక పెట్టిన కేకలకి రుక్మిణీ సత్యభామలే కాదు – దాసదాసీ జనం, కంచుకీ జనం, వేటకుక్కలు, చిలకలు, గోరింకలు, నెమళ్ళు – వేయేల... ప్రాణంగల సమస్త జీవరాసీ మేలుకొంది... "ఎట్లాగైతేనేం వాళ్ళందర్నీ నిద్రలేపే పని పూర్తిచేశాను – కానీ, నాకే దెబ్బలు తగిలాయి –" అని పొద్దున్నే ఏడుస్తూ కూచున్నాడు కౌశికుడు.

అతను చెప్పిందంతా విని, కృష్ణుడు నవ్వి "హంసపది మంచిపనే చేసింది – ఆ మాత్రం హడావిడి చెయ్యకపోతే, ఈ ఆడవాళ్ళు అంత తొందరగా నిద్రలేస్తారా...?" అన్నాడు వ్యంగ్యంగా !

కృష్ణుడు ఈ బృందావనంలో తన చిన్ననాటి సంగతులన్నీ గుర్తు చేసుకొంటున్నాడు.

రుక్మిణీ, సత్యభామ, మిగిలిన పరివారం అంతా అక్కడకు విచ్చేశారు. చిన్నప్పుడు ఎక్కువ శ్రమ పడకుండా వుండే కోతికొమ్మచ్చి ఆట ఆడుకొన్నామని – కృష్ణుడు ఆ ఆట గురించి వాళ్ళకు చెప్పాడు.

"చాలాకాలంగా ఆ ఆట ఆడాలని నాకూ వుంది –" అన్నాడు కౌశికుడు.

"నువ్వు ఆడితే నిజంగా కోతి కొమ్మచ్చి అనే పేరు సార్థకం అవుతుంది" అని వెక్కిరించింది హంసపదిక.

చిన్నప్పుడు ఇక్కడ కూర్చుని తను మురళి వాయిస్తుంటే ఆవులు నెమరేయడం మానేసి వినేవని చెప్పాడు శ్రీకృష్ణుడు తన బాల్యస్మృతుల్ని ఒక్కొక్కటే మననం చేసుకొంటూ.

మళ్ళీ మరొకసారి జగన్మోహనమైన ఆ మురళీరవాన్ని విన్పించవలసిందిగా కోరింది సత్యభామ.

"అలవాటు తప్పిపోయింది కదా... ఇప్పుడది మునుపటిలాగా శ్రావ్యంగా రాకపోవచ్చు. ఇలాంటి వాటన్నింటికీ బాల్యాన్ని మించిన రోజులు మళ్ళీ రావు..." అన్నాడు నవ్వుతూ కృష్ణుడు. "ఋతువుల్లో వసంతం ఎలాంటిదో బాల్యం అలాంటిది !" అని !

అంతలో –

సాత్యకి పెద్దగా అందరికీ వినిపించేట్లుగా "తెల్లవార్తోంది. అర్ఘ్యప్రదానం కోసం యమునకు వెళ్ళేవేళయ్యింది బయల్దేరండి" అని పిలిచాడు.

శీతామయూఖుడు అస్తమిస్తోన్న దృశ్యం అది ...

మీ నవ్వు వెన్నెలల ముందు తన చంద్రకాంతులు నిష్ప్రయోజనం అని సిగ్గుపడి చంద్రుడు వెళ్ళిపోతున్నాడు – అన్నాడు తన భార్యలతో కృష్ణుడు.

అప్పుడు కౌశికుడు – "సూర్యుడనే పండంటి బిడ్డను కనడం కోసం, తూర్పు దిక్కు అనే నిండు చూలాలు ప్రసవ వేదన పడుతున్నట్లుంది ఈ పక్షుల కిలకిలారావం – " అని వర్ణించాడు. వర్ణించి, "హంసపదికా! నువ్వు మంత్రసానివై ఆ పుట్టే బిడ్డకు బొడ్డు కొయ్యి – "అన్నాడు నవ్వులాటగా! "నువ్వు పురోహితుడవై జాతకర్మ నామకరణాలు చెయ్యి –" అని నవ్వింది హంసపధిక.

ఇంక బలరాముడు, సాత్యకి కూడా వచ్చారు. కృష్ణుడు ఆడవాళ్ళందరినీ, స్నానం చెయ్యడానికి వీలైన దుస్తులు తొడుక్కొని నది దగ్గరకు రమ్మని చెప్పాడు. ఈలోగా తానూ, బలరాములూ, సాత్యకీ సూర్యుడికి అర్ఘ్యవిధి నిర్వర్తిస్తాం" అన్నాడు.

చిన్నప్పుడు, పెంచిన తలిదండ్రుల్ని వదిలి, కంసుణ్ణి చంపడం కోసం మధురకు వెళ్ళిపోయిన బలరామకృష్ణులు ఇదే మళ్ళీ తిరిగిరావడం... ఆ ఇసుక తిన్నెలమీద నడుస్తూ చిన్ననాటి స్మృతుల్ని నెమరువేసుకోసాగారు బలరామకృష్ణులిద్దరూ !

"తెల్లవారకముందే సొమ్మంతా పడిపోయినట్లు – మనం ఇక్కడకు వచ్చినందుకు నదీ దేవత పళ్ళు బైట పెట్టి నవ్వుతోందా... అన్నట్లు తెల్లతామరలు వికసించాయి. ఇంటి గోడలమీద రుద్దడం కోసం తడిపిన జిగురు రంగు ముద్దలాగా సూర్యుడు ఉదయిస్తున్నాడు" అంటూ కౌశికుడు యమునానదీ తీరాన సూర్యోదయాన్ని తనదైన భాషలో వర్ణించాడు.

బలరాముడు, కృష్ణుడు, సాత్యకి యమునలోకి దిగి, సూర్యభగవానుడికి అంజలి ఘటించారు.

"హై భువనగేయ ! శతమఖ చతుర్ముఖ ప్రముఖ నిఖిల బర్హిర్ముఖ సంస్తూయమాన మహామహిమాభి శోభితాయ పద్మినీ మత్త కాశినీ కిలికించిత క్రియా పాటవ హస్తాయమాన సహస్రమయూఖ మండల విభ్రాజమానాయ మహాంధకార దంతావళ నిర్మూలనాభీల సంరంభ సమన్విత హర్యశ్వాయ సర్వకలుషాపహారిణే... భగవతే... కర్మ సాక్షిణే... నమస్తే... అంటూ కృష్ణుడు యమునా జలాలను తన దోసిటిలోంచి నదిలోకి వదలబోతున్నాడు. సరిగ్గా అదే సమయానికి ఆకాశంలో విమానం మీద వెడుతోన్న ఎవడో తాంబూలం నమిలి, తలకాయ బైటపెట్టి ఆ తమ్మిని పైనించి ఉమ్మేశాడు. అది తిన్నగా వచ్చి, అర్ఘ్యం వదలబోతోన్న శ్రీకృష్ణుడి చేతిలోకి వచ్చిపడింది.

మండిపడిపోయాడు. కోపంగా ఉరిమిచూశాడు...

"అరే దురాత్మా ... గర్వాంధకార ప్రమత్తహృదయ! నిష్కారణ మహత్పరి వాదశీల ! ఎవడవురా నువ్వు ..." అని ఆకాశం వంక చూశాడు. అప్పటికే ఆయన చూపును తప్పించుకొని విమానం ముందుకువెళ్ళిపోయింది. లేకపోతే, ఆయన కళ్ళలోంచి ప్రసరించిన విస్ఫులింగాగ్నికి ఆ విమానంతో సహా మండి మసైపోయి వుండేవాడు... ఆ వ్యక్తి.

బలరాముడు తెల్లబోయి – "తమ్ముడా! గోపాలకృష్ణా! ప్రళయకాల రుద్ర భయావహమూర్తివై చెవులు దద్దరిల్లేలా ... ఎర్రబారిన కళ్ళలోంచి నిప్పులు కురిపిస్తూ... ఆగ్రహిస్తున్నావు... సకల లోకారాధ్యుడవైన నీపట్ల అపచారం చేసినవాడెవడు...?" అన్నాడు.

జరిగింది వివరించాడు కృష్ణుడు.

కృష్ణుడి కోపాగ్నికి మాడిపోనున్న ఆ అభాగ్యుడెవడో కదా... అనుకున్నాడు సాత్యకి.

తన చక్రాయుధంతో ఆ దురాత్ముణ్ణి సంహరించి తీర్తానని భీషణ ప్రతిజ్ఞ చేశాడు కృష్ణుడు.

ఆ అపరాధి ఎవరు ?



కౌశికుడు ... "ఈ జలదేవతని అడిగితే చెప్తుందేమో..." అన్నాడు.

కృష్ణుడు కోపంగా – ఓ యమునా ! జలాధి దేవతా ! ఆ దుర్మార్గుడెవరో తెలిసికూడా చెప్పకపోతే, ఒకప్పుడు రఘురాముడు సముద్రాన్ని బంధించినట్లు, నిన్నిప్పుడే బంధిస్తాను – వెంటనే వాడెవడో చెప్పు –" అని గర్జించాడు.

అప్పుడు యమునానది – "ఓ మహాత్మా ! ఈ అపరాధానికి తలపడిన మందభాగ్యుడు నిషధగిరి మీద వున్న మణిపురాన్ని పాలించే గంధర్వరాజు గయుడు – " అని ధ్వనించింది.

జలనిధులు ఇంకుగాక ! కుల పర్వతాలు ఏడూ గ్రుంకుగాక ! ఆ జ్వలనుడు వేడిని విడిచి చల్లదనాన్ని పొందుగాక ! ఇటు సూర్యుడు అటు పొడుచుగాక ! ఏది ఏమైనా, ఆ దుర్మార్గుడి తలకాయిని ఖండించి తీరుతాను" అని మళ్ళీ ప్రతిజ్ఞ చేశాడు.

నేరస్థుడు ఎవరో తెలిసింది కాబట్టి ఇంక ఆగ్రహాన్ని చల్లార్చుకోవలసిందిగా కోరాడు కృష్ణుణ్ణి సాత్యకి.

మనసు పాడైపోయింది కృష్ణుడికి. జలక్రీడలు రద్దుచేశాడు. వ్రేపల్లె ప్రయాణం ఆపేశాడు. అందర్నీ వెనక్కి ద్వారకా నగరానికి ప్రయాణం అయిపొమ్మని ఆదేశించాడు.


కార్యక్రమం అంతా రసాభాసగా ముగిసింది. కృష్ణుడు చెదరిన మనసుతో వెనక్కి ప్రయాణం అయ్యాడు !

## 2

# గయుడి రాజసౌధం

భార్య చిత్రలేఖతో కలిసి బ్రహ్మలోకానికి వెళ్ళి ఆ పరమేష్టిని అర్చించి, ఆయన్ని మెప్పించి, ఎన్నో వరాలు పొంది తన రాజ్యానికి తిరిగివచ్చాడు గయుడు. ఆ సత్యలోక సౌందర్యం వర్ణించగలవాడీ మూడులోకాల్లోనూ లేడనుకొంటూ తన మిత్రులకు, పరివారానికి సత్యలోక విశేషాలు వివరిస్తున్నాడు నిషధగిరి పాలకుడైన గయుడు. బ్రహ్మదేవుడు తనకు ఏ వరాలిచ్చాడని అడిగాడు మంత్రి పుష్పదంతుడు.

"బ్రహ్మదేవుడు నా భక్తికి మెచ్చి వరం కోరుకోమన్నాడు". అప్పుడు నేనీ విధంగా అడిగాను...



బ్రహ్మదేవా... డబ్బివ్వు... అడుక్కునే వారికి, బీదవారికి, లేనివారికి దానం చేయడం కోసం.

అమితమైన బాహుబలాన్నివ్వు... దుష్టజన శిక్షణ కోసం.

దీర్ఘమైన జీవితాన్ని ప్రసాదించు – బ్రహ్మజ్ఞానాన్ని సంపాదించుకోవడం కోసం... ధర్మమార్గాన నడిచేలా మనసు కలిగించు. ఈ ప్రపంచానికి మేలు కలిగేందుకోసం...” అని అడిగాను. అందుకే... వరం అడిగిన క్షణం నుంచీ, నాకు ముక్తి మీద తప్ప జీవితంమీద కోరిక కలగడంలేదు–” అని వివరించాడు.

రాజుగారి పట్టపుటేనుగు – భద్రగజం – మరణించిందని తెలిసి, ఏవో అమంగళాలు మనసుకు తోస్తున్నాయని భయపడింది గయుడి భార్య.. “మా తాతగారి కాలం నాటి ఏనుగు అది. ముసలిది అయ్యింది, మరణించింది. దానికి ఇంత భయపడటం దేనికి... మనందరికీ మరణం ఎప్పుడైనా వుండేదే... సర్వజనులూ మరణానికి సిద్ధంగా వుండాల్సిందే కదా...” అన్నాడు భార్యను అనునయిస్తూ గయుడు.

గయుడు ఆ మాటలు అంటూవుండగా, ఆకాశవాణి “నిజం గంధర్వా – నిజం – సర్వజనులు మరణానికి సిద్ధంగా వుండాలి ... నువ్వు కూడా –” అని పలికింది.

ఆకాశంలోంచి విన్పించిన ఈ మాటలకు తెల్లబోయి చూశాడు గయుడు.

“ఈ భూభారాన్ని హరించడంకోసం యదుకులంలో అవతరించిన ఆది నారాయణుడు – దేవకీ సుతుడు – శ్రీకృష్ణుడు తన సుదర్శనచక్రంతో నీ తలను తెగనరికేందుకు సిద్ధంగా వున్నాడు –” అని సమాచారాన్ని అందించింది ఆకాశవాణి.

“హా! పరమేశ్వరా !” అంటూ ఆ మాటలు విన్నవాళ్ళంతా ఒక విధమైన మానసిక వత్తిడితో కళ్ళుతిరిగి మూర్ఛపోయి తెప్పరిల్లారు.

కృష్ణుడి కోపానికి కారణం ఏమిటో ఎవరికీ అర్థం కాలేదు – “చంపదలచిన వాడికి కారణాలేం వుంటాయి...” అనుకొంది గయుడి భార్య.

అప్పుడు పుష్పదంతుడు ధైర్యం కూడగట్టుకొని “ఓ అశరీరవాణీ...” అని పిలిచాడు. “భగవంతుడైన దేవకీనందనుడు నిష్కారణంగా ఈ మహాత్ముని ఎందుకు చంపాలను కొంటున్నాడు?” అనడిగాడు.

ఆకాశవాణి అంతా వివరంగా చెప్పింది – వాసుదేవుడి హస్తాంజలిలో ఈ గయుడు ఉమ్మివేశాడని !

గయుడికి తన తప్పు తెలిసింది – పైన వెళ్తున్నప్పుడు క్రిందనున్న వారి సంగతి గమనించకుండా ఉమ్మివేయడం తప్పే !

ఆ దారిలో, క్రింద యమునానదిలో కృష్ణుడు వున్నట్లు తెలిస్తే, ఉమ్మెందుకు వేస్తాడు ? దిగివచ్చి దర్శించుకొని మరీ వెళ్ళేవాడు ! తెలియకుండానే తనవలన పెద్ద తప్పు జరిగిపోయింది. అది మామూలు తప్పు కాదు – భగవంతుడి పట్ల అపచారం.

పుష్పదంతుడు, చిత్రలేఖ – అందరూ గయుడి వెంటే ఆ జనార్ధనుడి చక్రానికి ఎదురు నిల్చుని ఆత్మాహుతి చేసుకొంటామన్నారు –

"వెర్రివాళ్ళు మీరంతా ! ఒళ్ళు పొగరెక్కి ఉమ్మువేసి కృష్ణుని పరాభవించింది నేను – సుదర్శన చక్రం చంపవలసింది నన్నేగాని మిమ్మల్ని కాదు – అది మిమ్మల్ని చంపమన్నా చంపదు –" అన్నాడు వాళ్ళని ఓదారుస్తూ గయుడు.

అందరినీ అంగీకరింపచేసి, ఓదార్చి, తానొక్కడే కృష్ణుని సుదర్శనచక్రానికి ఎదురువెళ్ళి స్వచ్ఛందంగా మృత్యువుని ఆహ్వానించాలని నిర్ణయించుకున్నాడు గయుడు. ఎవ్వరినీ తన వెంట రావడానికి వీల్లేదని శాసించాడు. వంటరిగా బయల్దేరాడు. "హమ్మయ్యా ! ఇప్పుడు నాకు బంధవిమోచనం అయ్యింది – ఆలుబిడ్డలు అవసానకాలంలో దగ్గరుండకూడదు – సుఖంగా మరణించనివ్వరు –" అనుకొన్నాడు. సాధ్యమైనంత త్వరగా బ్రహ్మలోకానికి చేరుకోవాలని ఆయన తాపత్రయం.

మరణం పొందిన తర్వాత, సుగతులు పొందుతాడో ... దుర్గతులు పొందుతాడో? అజ్ఞానంతో ... తెలియక చేసింది ఈ ఒక్క తప్పే ! బుద్ధి పూర్వకంగా ఒక్క దోషానిక్కూడా పాల్పడలేదు కదా... కృష్ణుడు క్షమిస్తాడేమో... ఏమో... ఎట్లయినా మంచిదే... మరణం సంభవిస్తే బ్రహ్మలోకం, క్షమాబిక్ష దొరికితే, మళ్ళీ మణిపురం – మళ్ళీ రాజ్యపాలనం ..." అనుకొంటూ బయల్దేరాడు గయుడు.

సరిగ్గా ఆ సమయంలో సరస్వతీదేవితో సహా బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు.

"మహాత్మా ! హిరణ్యగర్భా ! ఆర్తావన దీనరక్షా పరతంత్రా ..." అంటూ పాదాలమీదపడి రోదించాడు గయుడు.

బ్రహ్మ ఆయన్ని లేవనెత్తి ఊరడించాడు. "అంతలో ఎంత కష్టం సంభవించిందీ..." అనుకొంది సరస్వతీదేవి. బ్రహ్మ నుండి వరాలు పొంది, విష్ణువు వలన మరణం పొందడమా !

"గయుడా ! నీ ఆర్తి నాకు అర్థం అయ్యింది. నీ పరిస్థితి ఎలా వుందంటే, సింహానికి కోపం తెప్పించి ఏనుగును శరణుకోరిన లేడిలాగా వుంది !

నిన్ను చంపుతానన్నవాడు సాక్షాత్తూ విష్ణుమూర్తి. ప్రయోగిస్తానన్నది సుదర్శనాన్ని. దాన్ని ఎవరు ఆపగలరు ?

గంధ సింధుర పరిపంథియైన గరళకంఠుడు ఆ పరమశివుణ్ణి శరణు కోరు – ఆయన నిన్ను రక్షించవచ్చు –" అని సలహా చెప్పాడు బ్రహ్మదేవుడు.

శివుడు కూడా ఇదే పద్ధతిలో మాట్లాడాడు. విష్ణువుకు విరోధులు నాక్కూడా విరోధులే! అతని భక్తులు నాక్కూడా భక్తులే ! ఆయనకూ నాకూ తేడా లేదు కాబట్టి, బ్రహ్మదేవుణ్ణే ఆశ్రయించు. నేనేం చెయ్యలేను – అన్నాడు.

గయుడికి దిక్కుతోచలేదు. చావడంకోసమే సిద్ధపడినా, ఎవరినైనా ఆశ్రయించి ప్రాణాలు నిలబెట్టుకోవాలనే ఆశ క్రమేణా బయల్దేరసాగింది గయుడిలో !

"చావునకు మనసొప్పుటలేదు. ఇంకాశ్చర్యమేమున్నది ? మృత్యుభీతి జంతుజాలానికి సహజం కదా !" అనుకొన్నాడు గయుడు.

దేవతలందర్నీ ప్రార్థించి చూశాడు – యక్షులారా ! సిద్ధులారా ! సాధ్యులారా ! విద్యాధరులారా ! కిన్నరులారా ! కింపురుషులారా ! ... అంటూ అందర్నీ అర్థించాడు. దేవతల దేవుడే ఆగ్రహిస్తే వీళ్ళా రక్షించగలవారు ?

ఈ సర్వ ప్రపంచంలో విష్ణువులేని చోటు ఎక్కడ ? ఎక్కడని తాను దాక్కోగలడు ?

"ఓ జగన్నాథా! నీ అర్ఘ్యవిధికి విఘ్నం కల్గించాను కాబట్టి నామీద నీకు ఆగ్రహం తప్పకుండా వస్తుంది. కానీ, నీ అంతటివాడు ఇలాంటి తప్పులు పట్టించుకోకూడదు – చేసిన తప్పు చిన్నది. శిక్ష పెద్దది వేస్తున్నావయ్యా ..."

అహింసా పరమోధర్మః ... అనే పరమ జ్ఞానుల మాటలు నీకు గుర్తులేవా ...

ప్రహ్లాద విభీషణాది రాక్షసుల్నే కాపాడావే ... నన్ను బ్రోచడం నీకు భారమైనదా కన్నతండ్రీ ... దేవకీ నందనా... ??

అంటూ గయుడు తన ప్రయత్నాలన్నీ విఫలమై దుఃఖంతో దిక్కుతోచక తిరుగుతున్నాడు.

గయుడు అలా మూర్ఛ స్థితిలో పడివున్నప్పుడు నారదుడు అక్కడకు వచ్చాడు.

కలహభోక్తవు కావలసిందిగా బ్రహ్మ తనకు చెప్పినప్పటినించీ, కొన్నాళ్ళుగా మంచి కలహభోజనం దొరక్క కటిక ఉపవాసాలు చేసి గడపవలసి వస్తోంది... ఇప్పుడు వాసుదేవుడు గయుడ్ని చంపుతాననడం చేత ఆయనకి కడుపునిండా కొంత కూడు దొరుకుతుందేమోనని ఆశగా వుండి ఈ కలహ వృక్షాన్ని పెంచి పెద్దది చేయాలనుకున్నాడు నారదుడు.



నారదుణ్ణి చూసి అభివాదం చెయ్యగానే గయుణ్ణి "దీర్ఘాయురస్తు!" అని దీవించి, "మరీ అంత భయపడాల్సిన పనిలేదు –" అన్నాడు నారదుడు. "ఈ ఆపద సమయంలో నీకు రక్షణ ఇవ్వగల మహాపురుషుడు ఒక్కడే వున్నాడు – ఆర్తావన దీక్షాపరతంత్రుడు! శూర శిఖామణి! సౌజన్యచూడామణి ! పాండవ మధ్యముడైన అర్జునుడు... నీ కష్టాన్ని కడవపెట్టగల సమర్థుడు ఆయన... ఆయన్ని శరణువేడు" అంటూ నారదుడు కథని మరో మలుపుతిప్పి, గయుణ్ణి అర్జునుడి దగ్గరకు పంపాడు. ఇప్పుడు కలహం కృష్ణార్జునుల మధ్య... కథ పసందుగా వుండాలి కదా !!

"అర్జునుడి దగ్గరకి త్వరగా వెళ్ళి విషయం ఏదీ చెప్పకుండా శరణు కోరుకో... అంతే !" అని హెచ్చరించి మరీ పంపాడు. కృష్ణుడే చంపుతానన్నాడన్న సంగతి తెలిశాక అర్జునుడు శరణు ఎందుకిస్తాడు ... ? తెలియకుండానే మాటతీసుకోవాలి చాకచక్యంగా ! అదీ నారదుడి ఎత్తు.


## 3

# ద్వైతవనంలో పాండవుల ఆశ్రమం

పాండవులు అరణ్యవాసంలో వున్న సమయం అది. ఎప్పుడు ఇంద్రప్రస్థాన్ని పరిపాలించామో... ఎప్పుడు రాజసూయం చేశామో... ఎప్పుడు మహావైభవాలు అనుభవించామో... అన్నీ కలలోలాగా జరిగిపోయాయి... కౌరవుల చేత వంచింపబడి, ఈ అడవులుబట్టి తిరగవలసిన దుస్థితి దాపురించింది కదా... అనే నిర్వేదంలో వున్నాడు అర్జునుడు.

మన కష్టాలు మొట్టమొదట వున్నంత దుస్సహంగా లేవులే... అలవాటు పడితే, కష్టాలు కష్టాలుగా కన్పించవు – సుఖాలే అన్పిస్తాయి అంటున్నాడు అర్జునుడు సహదేవుడితో – ఆ అన్నదమ్ములు ఎండకి అలసి ఓ చెట్టు కింద విశ్రాంతి తీసుకొంటుంటే, "మహాత్మా! పాండవమధ్యమా! సంక్రందననందనా ! శరణాగత రక్షణ బిరుదాలంకృతా! శరణు శరణు – ..." అంటూ దూరం నుంచే దణ్ణాలు పెట్టుకొంటూ పరుగు పరుగున వచ్చాడు గయుడు.

అర్జునుడికి తనను శరణుకోరి వచ్చిన గయుణ్ణి చూడగానే ఆవేశం ఆగలేదు – ఆ వచ్చింది ఎవరో – అతనికి ఎవరినించి రక్షణ కావాలో, విషయం ఏమిటో... ఏమీ ఆలోచించలేదు – కేవలం ఆవేశం... అంతే ..." ఓయీ ! దీనజనావసన దీనరక్షాపరతంత్రుడైన ఈ అర్జునుడు సూర్యచంద్రాది గ్రహాల సాక్షిగా, భూమ్యాకాశాది పంచభూతాల సాక్షిగా నీకు అభయం ఇస్తున్నాడు – ఎవరు వచ్చి విడవమన్నా సరే నిన్ను విడువను – భయపడకు కూర్చో –" అన్నాడు.



గయుడికి అదే కదా కావాల్సింది – నారదుడు ఎలా అడగమని సలహా చెప్పాడో అచ్చం అలాగే అడిగాడు. అర్జునుడు కూడా అలాగే అభయం ఇచ్చాడు.

"హమ్మయ్యా ! నా ప్రాణాలిప్పటికి కుదుటపడ్డాయి –" అనుకొన్నాడు గయుడు.

"అన్నయ్యా ! అసలీయన ఎవరో అడిగితే మంచిదేమో –" అన్నాడు సహదేవుడు.

"భయంతో వణికిపోతున్న వాడికి భయంతీర్చిన తర్వాత అడగడం ధర్మం. కాసేపు అతన్ని విశ్రాంతి తీసుకోనీ... అప్పుడు అడుగుదాం !" అన్నాడు అర్జునుడు.

కాసేపటికి కుదుటపడ్డాక చావుకబురు చల్లగా చెప్పాడు గయుడు... తను చేసిన నిర్వాకం... అందుకు కృష్ణుడు చేసిన ప్రతిజ్ఞల గురించి !

అర్జునుడికి మతిపోయినట్లయ్యింది ! "ఆ మాట ముందే ఎందుకు చెప్పలేదయ్యా ! నిరంకుశ ప్రతాపుడైన ఆ కృష్ణభగవానుడిపట్ల నువ్వు అపచారం చెయ్యడం ఏమిటీ – నేను రక్షించడం ఏమిటీ –" అన్నాడు.

"అయ్యా మొదటే చెప్పేస్తే మీరు నాకు రక్షణ ఇస్తారా ?" అనడిగాడు గయుడు. తాను మోసపోయానని గ్రహించాడు అర్జునుడు.

తిని కూర్చోవడం చేతకాక, అకారణంగా కృష్ణుడితో ఈ వైరం తెచ్చుకోవడం ఏమిటో... అర్థం కాలేదు అర్జునుడికి !

ఛీ పొమ్మని ఈ గయుణ్ణి వదిలేస్తే సకల రాజన్యులలో అప్రతిష్ఠ కల్గుతుంది. వదిలేయకపోతే కలలో కూడా ఊహించని వైరం ఆ శ్రీకృష్ణుడితో ఏర్పడుతుంది.

తమ్ముడా ! సహదేవా ! నువ్వు చిన్నవాడివైనా బుద్ధికి బృహస్పతివి – ఈ పరిస్థితుల్లో ఏం చెయ్యాల్లో ఆలోచించు –" అన్నాడు అర్జునుడు. క్షణం గడిచేకొద్దీ అర్జునుడిలో ఖంగారు పెరగసాగింది.

"పొరబాటున జరిగిందే కానీ ఈ తప్పు కావాలని చేసింది కాదు కాబట్టి ఆ పరమాత్మ ఇతన్ని తప్పకుండా క్షమిస్తాడు –" అని ధైర్యం చెప్పాడు సహదేవుడు.

"క్షమించకపోతే..." అని అడిగాడు సందేహంగా అర్జునుడు.

"క్షమించకపోతే, ఈ గయుణ్ణి ఆయనకు వదిలేయడమే !" అని తేల్చి చెప్పాడు సహదేవుడు.

ఇంతలో ధర్మరాజు అక్కడకు చేరాడు. అర్జునుడు, సహదేవుడు విచారంగా వున్నా రేమిటా అనుకున్నాడు. కృష్ణుడితో వైరం అని వినేసరికి ఆయనకు స్పృహతప్పినంత పనయ్యింది.

నకులుడు, భీముడు వచ్చిన తర్వాత ఆలోచిద్దాం అని సర్దిచెప్పాడు సహదేవుడు.

నకులుడు వచ్చి ధర్మరాజు ఏ నిర్ణయాన్ని తీసుకుంటే, ఆ నిర్ణయానికి కట్టుబడి వుంటానన్నాడు.

అర్జునుడు ధర్మవిరుద్ధమైన కార్యం ఏమీ చెయ్యలేదు. క్షత్రియ ధర్మాన్నే పాటించాడని సమర్థించాడు భీముడు.

నిరంతరం నారాయణ పద సేవా పరాయణుడైన అక్రూరుడు కూడా అదే సమయానికి వచ్చాడు !

అర్జునుడు గయుడికి అభయం ఇచ్చాడని నారదుడు అప్పుడే కృష్ణుడికి చెప్పేశాడు. అందుకే, నన్ను, సుభద్రనీ మీతో మాట్లాడమని కృష్ణుడు పంపాడు – అని వివరించాడు అక్రూరుడు. గయుడు రావడం, అర్జునుడు మాట ఇవ్వడం, వెనకాలే అక్రూరుడు రావడం – అన్నీ వెంటవెంటనే జరిగిపోయాయి.

సుభద్ర వచ్చిందని తెలిసి అర్జునుడి ముఖం వికసించింది. ఆమె పర్ణశాలలో ద్రౌపది దగ్గరకు వెళ్ళిందని చెప్పాడు అక్రూరుడు.

"ఇప్పటివరకూ గయుడికి శరణు ఇచ్చివుండకపోతే, ఇంకముందు ఇవ్వకండి – ఇప్పటికే ఇచ్చివుంటే, తక్షణం అతన్ని వదిలి పెట్టేయండి. ఇది కృష్ణుడు మీతో చెప్పమన్న విషయం" అని తాను వచ్చిన వైనం తెలిపాడు అక్రూరుడు.

"గయుడు భయంతో వణికిపోతూ పాదాలమీద పడితే, అభయం ఇచ్చాడు మా అర్జునుడు. అందులో తప్పేం వుంది. భయంతో వణుకుతున్నవాణ్ణి ఉత్తమ కుల సంజాతుడు ఎందుకు, ఏమిటీ అని ప్రశ్నలతో వేధించడు – భయంలేదు నేనున్నానంటాడు. ఒకవేళ కృష్ణుడికే ఇది జరిగితే ఆయన మాత్రం శరణు ఇవ్వకుండా వుండగలడా..." అన్నాడు పౌరుషంగా భీముడు !



“పాత చుట్టాలం అని నొక్కి చెప్పమన్నాడయ్యా అర్జునా... నీతో మాబావ. ఎవడో ముక్కూ మొహం తెలీనివాడి కోసం ‘పగ’ పెంచుకోవడం మంచిది కాదని కూడా చెప్పమన్నాడు. పడుచుదనం పౌరుషంతో అనవసరమైన శత్రుత్వాన్ని పెంచుకోవద్దన్నాడు. తలకు మించిన పనిని చెయ్యవద్దన్నాడు” అని మరీ మరీ హెచ్చరించాడు గట్టిగానే అక్రూరుడు. కృష్ణుడి వీరత్వం గురించి, ఆయన మహాత్మ్యం గురించి ప్రత్యేకంగా గుర్తుచేశాడు.

అర్జునుడికి ఆ మాటలు వినేసరికి పౌరుషం ఆగలేదు.

అక్రూరా ! ఆయన ప్రతాపం మాకు తెలియంది కాదు. కానీ, నేను పుట్టింది ఉత్తమ క్షత్రియవంశం. చేసింది మహా ప్రతిజ్ఞ. చేసిన ప్రతిజ్ఞని నెరవేర్చడం కోసం నేను ఎంత సాహసం చేయగలనో కృష్ణుడికీ తెలుసు. పూర్వాపరాలు తెలుసుకోకుండా గయుడికి నేను అభయం ఇవ్వడం నా తప్పే కావచ్చు. కానీ, జరిగిపోయిందానికి నేనేం చెయ్యగలను – శ్రీకృష్ణుడు నాకు పరమ ఆప్తుడయితే, మాట తప్పి నేను లోకనిందపాలు కాకుండా తాను అనుగ్రహించవచ్చు కదా ! అతను గయుణ్ణి క్షమించి విడిచి పెట్టేస్తే లోకం ఆయన ఔదార్యాన్ని కొనియాడుతుందేగాని, ఆయనకొచ్చే అవమానం ఏమీ వుండదు –” అన్నాడు – కొంచెం కఠినంగానే !

“నువ్వు నీ ప్రతిజ్ఞ మాత్రమే చేసూకొంటున్నావు – అవతల మహాత్ముడు చేసిన ప్రతిజ్ఞ కూడా నెరవేరాలి కదా... అయినా ఇదంతా ఎందుకు – నీ సమాధానం ఏమిటో చెప్పు –” అని రెట్టించాడు అక్రూరుడు.

ధర్మరాజు కల్పించుకొని, “సమాధానం ఇచ్చేందుకు ఏముంది...” అన్నాడు.

“శ్రీకృష్ణుడితో ఏం చెప్పమంటావు –” అని అడిగితే,

ఆ శ్రీమన్నారాయణుడు మాకు బంధువు అవడం మా భాగ్యం అన్నాని చెప్పు –

చిన్నప్పటి నుంచీ, పాండవులు ఆయన ఆజ్ఞను ఎప్పుడూ జవదాటలేదని చెప్పు –

ఎన్నిసార్లు వెతికినా మావాడు చేసిన తప్పు ఇదొక్కటే అని వివరించు –

పరాయివాడికోసం పంతాలకు పోవడం తమవంటి వారికి తగదని అన్నామని చెప్పు –

పాండవులు విడరాని బంధువులని ఆయనకు గుర్తుచెయ్యి –

గయుణ్ణి క్షమించి, అర్జునుణ్ణి కాపాడమన్నానని చెప్పు –" అని వినయంగా వివరించి చెప్పాడు అక్రూరుడికి ధర్మరాజు.

భీముడు కూడా తనమాటగా "జరాసంధుడి వధకోసం తనను కృష్ణుడు వెంటపెట్టుకు వెళ్ళిన సంగతి జ్ఞాపకం తెచ్చుకొని గయుణ్ణి క్షమించి, పాండవుల మీద ఆగ్రహాన్ని తెచ్చుకోవద్దన్నానని చెప్పమన్నాడు.

"యతివేషంలో వున్న తనని పిలిచి సుభద్రనిచ్చి పెళ్ళి చేసిననాడు తనపై ఆనాడు చూపించిన ప్రేమాదరాన్నే ఇప్పుడూ చూపించవలసిందిగా కోరానని నామాటగా చెప్పు' ' అన్నాడు అర్జునుడు.

"శరణు అడిగిన గయుడూ నీ భక్తుడే – శరణు ఇచ్చిన అర్జునుడూ నీ భక్తుడే – ఇందులో పరాయివాళ్ళెవరూ లేరు – ఆప్తులు చేసింది తప్పు అవుతుందా – " అన్నాడు నకులుడు.

"కౌరవులు మామీద కుట్రలు చేసినప్పుడు మమ్మల్ని కాపాడినవాడు ఆయన ! ఇవ్వాళ మామీద నేరాలు వెతకడం ఏమిటీ – నీ చరణారవిందాల్ని మనసారా నమ్మి పూజిస్తున్న వాళ్ళం – కలకాలం మమ్మల్ని కాపాడే భారం ఆయనదే" అన్నానని కృష్ణుడికి తెలియజేయమన్నాడు సహదేవుడు.

అందరి సందేశాలూ విన్నాక అక్రూరుడు పెదవి విరిచాడు –" ఇవన్నీ సరే ... కృష్ణుడి ఆజ్ఞని తిరస్కరించాలనుకుంటున్నారా... తేల్చి చెప్పమని సూటిగా అడిగాడు –

"తిరస్కరిస్తున్నట్లు మేమనలేదు కదా –" అన్నాడు అర్జునుడు –

"మీ మాటలకు అంతకన్నా అర్థం ఏముంది ?" అందులో అర్థం ఏమిటో కృష్ణుడికి నువ్వే వివరించి చెప్పు –"

"ఇంకా చెప్పేందుకు ఏముంది ? కృష్ణుడితో యుద్ధానికి సిద్ధంగా వుండండి –" కోపంగా అన్నాడు అక్రూరుడు.

"యుద్ధం చేయాల్సివస్తే అట్లాగే చేస్తాం–" అన్నాడు భీముడు అంతకన్నా రౌద్రంగా !

"అందాకా పోనివ్వడం దేనికీ, ఏదో సౌమ్య మార్గంలో ఈ సమస్య పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నాను–" అన్నాడు ధర్మరాజు. "మేం కృష్ణుడిపట్ల వినయంగా వున్నామని చెప్పు చాలు" అని తేల్చి చెప్పాడు.

ఈ సంభాషణంతా వింటున్న గయుడు ప్రాణభయంతో వణికిపోతుంటే, ధర్మరాజు ఆయన్ని ఓదార్చి ధైర్యం చెప్పి, అర్జునుడు నిన్ను తప్పకుండా కాపాడతాడు – భయపడకు" అని స్వయంగా ధర్మరాజే ఈసారి గయుడికి ధైర్యం చెప్పాడు.

అప్పుడు అర్జునుడన్నాడు – "రాజకీయాల్లో స్నేహాలు, శతృత్వాలు, క్షణభంగురాలు" అని !

అర్జునుడు, భీముడు కృష్ణుడితో యుద్ధం చేయడానికే మొగ్గుచూపారు.

మనం ఎంత నిత్య నిష్ఠతో వున్నామో పరీక్షిద్దామని కృష్ణుడు కావాలని ఇలా ప్రవర్తిస్తున్నాడేమోనని అనుమానించాడు ధర్మరాజు. లేకపోతే కృష్ణుడితో అర్జునుడికి యుద్ధం ఏమిటీ –

అర్జునుడు, తను యుద్ధానికి సన్నద్ధంగానే వున్నట్లు ప్రకటించాడు. "శూరశిఖా మణులు పుట్టిన భరతకులంలో పుట్టి నేను మాత్రం యుద్ధానికి భయపడతానా ?" అన్నాడు ధర్మరాజు.

"అదీగాక, ఎల్లకాలం కృష్ణుడితో కొంగుచాటున వుండిపోయి, పాండవుల బలదర్పాలు ప్రదర్శించుకునే అవకాశం లేకుండా పోతోంది. వాసుదేవుడికి ప్రత్యర్థులుగా యుద్ధంలో నిలబడితేగాని, మనకు ఆ అపఖ్యాతి పోదు –" అని ధర్మరాజు యుద్ధం అవసరం గురించి చెప్పాడు.

"ఒకవేళ యుద్ధంలో గెలవలేక మృతి చెందినా పాండవులు ధర్మకార్యం కోసం శరీర త్యాగం చేశారనే సత్కీర్తి దక్కుతుంది –" అన్నాడాయన.

"తన శరీరాన్ని, తన సంపదని, తన కాలాన్ని, తన డబ్బుని, తన విద్యనీ జగజ్జనానికి వినియోగించిన నరుడే నరుడు… వాడిదే ఈ ప్రపంచం –" అని ప్రకటించాడు ధర్మరాజు.

యుద్ధానికి అన్నగారి అనుజ్ఞ వచ్చినట్లయ్యింది. పాండవులు కృష్ణుడితో పోరుకు సమాయత్తమయ్యారు.

సుభద్రాదేవి మాత్రం పాండవుల నిర్ణయాన్ని విని, "మీకు నేను ధర్మం ఉపదేశానికి రాలేదు – దయామయులైన మిమ్మల్ని వేడుకోవడానికి వచ్చాను – అనేకసార్లు మనకి ఉపకారం చేసిన బావమరిదితో యుద్ధానికి తలపడినందువలన మనల్ని కృతఘ్నులంటారని భయపడ్తున్నాను –" అని నచ్చచెప్పాలని ప్రయత్నించింది.

"ఆయన మనకమితోపకారం చేసినా, అధర్మకార్యానికి నన్ను పురికొల్పుతున్నప్పుడు నేను ఆయన్ని మన్నించాలా ?" అన్నాడు రోషంగా అర్జునుడు.

యుద్ధంలో ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధమే కాని, గయుణ్ణి మాత్రం వెనక్కి ఇచ్చేది లేదని తేల్చిచెప్పాడు.

"మీరంతా అరణ్యవాసంలో వున్నారని ఇన్నాళ్ళూ అన్నగారింట్లో నన్ను ఉండనిచ్చినందుకు అన్నగారిపట్ల మనం విశ్వాసహీనంగా ప్రవర్తిస్తున్నామని సత్యభామాదులు నన్ను హేళనచెయ్యరా...?" అని సుభద్రాదేవి దుఃఖించసాగింది.

అట్లాగయితే, జ్ఞానహీనులైన వాళ్ళదగ్గరికి వెళ్ళనే వెళ్ళకు. ఇక్కడే మాతోపాటే వుండు –" అన్నాడు భార్య సుభద్రాదేవితో అర్జునుడు.


"మీ బావామరుదుల మధ్య నేను నలిగిపోతున్నాను. దైవం ఎలా చేయదలిస్తే అలా చెయ్యనీ" అంటూ ఏడుస్తూ వెళ్ళిపోయింది సుభద్ర.

# 4

# ద్వారకా నగరం - కృష్ణుడి అంతఃపురం : రుక్మిణీ సత్యలకు చివాట్లు

పాండవుల దగ్గరకు వెళ్ళి తిరిగివచ్చిన అక్రూరుడు గానీ, సుభద్రగానీ, వెంటనే కృష్ణుణ్ణి కలవలేదు. పాండవుల సమాధానం ఏమిటో తెలియచేయలేదు.

అక్రూరుడింత ఆలస్యం ఎందుకు చేస్తున్నాడో అర్థంకాక బలరాముడు, కృష్ణుడు కూడా ఖంగారుపడ్డారు. సాత్యకి కౌశికుణ్ణి అక్రూరుడిదగ్గరకి పంపించాడు. అతని ముఖ కవళికల్ని బట్టి పాండవుల నిర్ణయం ఏమైవుంటుందో ఊహించాలని చూశాడుగానీ,



కౌశికుడు చక్కగా చెప్పలేకపోయాడు. అక్రూరుడు చెప్తాడు కదా... అని కృష్ణుడు సుభద్ర దగ్గరకి వెళ్ళి అడగలేదు. వెళ్ళివచ్చిన ఆ ఇద్దరూ గుంభనంగా వుండిపోయారు.

పాండవులు గయుణ్ణి విడిచిపెట్టేస్తారనే తన నమ్మకం – అన్నాడు కృష్ణుడు.

వాళ్ళు బలగర్వితులు. రాజసూయయాగం చేసిన నాటి ఆ బలగర్వం వాళ్ళలో ఇంకా వుంది. బహుశా యుద్ధానికి సన్నద్ధులౌతున్నారనే అనుకొంటున్నాను – అన్నాడు బలరాముడు.

అందరూ ఇట్లా ఊహాగానాల్లో వుండగా ఎప్పటికో వచ్చాడు అక్రూరుడు. వస్తూనే, ఇంకెప్పుడూ రాయబారాల పనిని నెత్తినపెట్టుకోకూడదంటూ వచ్చాడు. "కత్తితో సాము చేయడం లాంటిది రాయబారిగా వెళ్ళడం అంటే ! అక్కడి అప్రియమైన మాటల్ని ఇక్కడ స్వామికి నివేదన చెయ్యాలి కదా ..." అన్నాడు.

విషయం చాలావరకూ అర్థం అయిపోయింది. అన్నదమ్ములు ఒక్కొక్కరూ ఏం చెప్పారో, వున్నది వున్నట్లు తెలియజేశాడు అక్రూరుడు.

కృష్ణుడు నిర్ఘాంతపోయాడు. అర్జునుడు ఇంతపని చేస్తాడని ఆయన ఊహించలేదు. తన బహిఃప్రాణం అనుకొన్నవాడే తనతో యుద్ధానికి తలపడడాన్ని తట్టుకోలేకపోయాడు.

సుభద్ర కూడా వచ్చింది – "నీ ముద్దుల మరిది కూడా గయుణ్ణి విడవడానికి వీల్లేదని చెప్పాడని నీకు ఎలా తెలపాలో...?" అంటూ గుడ్లనీరు కుక్కుకుంది.

"ఈ మహా మూర్ఖులకేమి చూసుకొని ఈ త్రుళ్ళిపాటో..." అన్నాడు ఆగ్రహంగా బలరాముడు. "నీ మరిదిని రక్షించు అన్నయ్యా..." అని వేడుకొంది సుభద్ర.

"తెలియక శరణు ఇచ్చారు. అందులో తప్పేముంది ?" అని సమర్థించ బోయిందామె. "తెలియక ఇచ్చాడు. తెలిసి బాధపడ్డాడా?" అన్నాడు వ్యంగ్యంగా బలరాముడు.

"అంతేలే ! తప్పు నాదేగాని, మీ ఆయనది కాదులే ! నీ భర్తకి నేను బావమరిదిని కావడం ఒకతప్పు. అన్నగారి మాటని కాదని, నిన్ను ఆ మహానుభావుడికిచ్చి పెళ్ళి చేయడం ఇంకో తప్పు. చిన్ననాటి స్నేహితులని పదేపదే వారికి ఉపకారం చెయ్యడం మరో తప్పు. బలగర్వంతో వాళ్ళు చేసిన దౌష్ట్యాలన్నింటిని కప్పిపుచ్చుకొంటూ రావడం ఇంకో తప్పు ...

అన్నీ ఒప్పులే చెయ్యడం పెద్ద తప్పు. అసలు తప్పులే చెయ్యకపోవడం గొప్ప తప్పు. అన్ని తప్పులూ మావైపే వున్నాయమ్మా ! అర్జునుడు అసలు తప్పే చెయ్యడు కదా..." అన్నాడు కృష్ణుడు ఎంతో బాధగా.

"అయినా నిన్ననవలసిన పనిలేదు – ఆడవారి బుద్ధి అలాగే వుంటుంది.

పుట్టింది మొదలుకొని పుట్టింటి వారెంత భాగ్యం ఇచ్చినా, కొంచెమైనా అన్నదమ్ములమీద ప్రేమ చూపించరు – మధ్యలో వచ్చిన మొగుడంటేనే పడిఛస్తారు–" అని కసురుకున్నాడు.

"సారెలు, చీరెలు అంటూ పుట్టింటిని గుల్లచేసి చివరికి మొగుడు పక్షంచేరి మాట్లాడతారు. మొగుడే అధికం ఆడదానికెప్పుడూ–" అన్నాడు వ్యంగ్యంగా !

కృష్ణుడి మాటలకు పెద్దగా ఏడ్చేసింది సుభద్ర. "అన్నా! ఇవి పలుకులు కావు – ములుకులు –


ఆమె దుఃఖాన్ని మరింత పెంచుతూ, బలరాముడు కూడా "అమ్మాయి! ఏడవడం దేనికి, శంకరుణ్ణి జయించిన, గర్వోన్నతుడు, ఖాండవ వనాన్నే దహించగల్గినవాడు, ద్రోణాచార్యుడి ప్రియశిష్యుడు, నీ ప్రాణనాయకుడు అర్జునుడుండగా ఏడవడం దేనికమ్మా... అతనికి మావలన భయం లేదు – అతనే మమ్మల్ని చంపేస్తాడు – ఏడవకమ్మా ఏడవకు – " అన్నాడు.

"మొగుడు దరిద్రుడైనా, చెడుమార్గంలో పడినా, తప్పుడు మనిషైనా, భార్యకి అతనే దేవుడు – భార్యదృష్టిలో అతనే గొప్పవాడు కూడా ! మంగళసూత్రం మీద వున్న భక్తి అలాంటిది మరి!" ఇదీ బలరాముడి వ్యాఖ్య !

కృష్ణుడు అందుకొని, "అమ్మాయి ! ఇన్ని–మాటలెందుకు – రెండు పద్ధతులు చెప్తాను విను. నీ మొగుడు బతికాడా నీ అన్న చచ్చాడనుకో ! నీ అన్న జీవించాడా... నీ భర్త "సున్నా" అనుకో. ఇంక అనవసర విషయాలు మాట్లాడడం ఆపేసి నువ్వు అవతలికి వెళ్ళిపో –" అన్నాడు కోపంగా.

సుభద్రకు ఏం చెయ్యాలో దిక్కుతోచలేదు – అటు భర్తతో అవమానం – ఇటు అన్నలతో అవమానం – వీళ్ళలో ఎవరికి హాని కల్గినా తను సహించగలదా...

"ఈయన దగ్గరికి మా వదినెలు రుక్మిణీ సత్యభామల్ని, మా అమ్మనీ పంపిస్తాను. వాళ్ళ మాటలకైనా మా అన్న శాంతిస్తాడేమో..." అనుకొంటూ వెళ్ళిపోయింది సుభద్ర.



సాత్యకి మాత్రం సుభద్ర పక్షాన మాట్లాడాడు – "అన్నయ్యా ! సుభద్ర పరిస్థితి చూస్తే జాలేస్తోంది. అన్నగారి పక్షాన మాట్లాడితే భర్తకు కోపం. భర్త పక్షాన మాట్లాడితే అన్నగారికి కోపం. మధ్యలో నిష్కారణంగా నలిగిపోతోంది – వెనక గొయ్యి – ముందు నుయ్యి అన్నట్లుంది పరిస్థితి –" అన్నాడు.

సమర సన్నాహాలు ప్రారంభిద్దాం అన్నాడు కృష్ణుడు.

అంతలో హడావిడిగా రుక్మిణి అక్కడకు వచ్చింది. ఆమె అర్జునుడి పక్షాన మాట్లాడటానికి వచ్చిందని ఊహించాడు కృష్ణుడు.

ఆమె, 'అర్జునుడు' అని మాట్లాడటం మొదలుపెట్టగానే, "ఆ మదాంధుడి పేరు నా దగ్గర ఎత్తకు" అని కసురుకున్నాడు కృష్ణుడు.

"మొదట్లోనే కొట్టవచ్చినట్లు మాట్లాడతారేవిటి... మన సవ్యసాచిని మనం రక్షించుకోవద్దా... ప్రేమతో పెంచిన విషవృక్షాన్నయినా చేతులారా నాశనం చేసుకొంటామా..." అంది కొంచెం మందలింపుగానే రుక్మిణీదేవి.

అర్జునుడి మీద నీకు అనుగ్రహం కలిగింది గాని, మాకు గల్గదు... అతనితో యుద్ధం చేయ్యవద్దంటావేమిటీ... ఇది నీ తప్పుకాదు – ఆ రోజున నేను సగం తల, సగం మీసం గొరిగి వదిలేసినా ఇంకా సిగ్గులేకుండా బతికే వున్న మీ అన్న రుక్మికి చెల్లెలివి కావా... మీది హీనమైన జాతి ... ఆత్మాభిమానం మీ వంశానికి తెలుసా... అసలు!" అంటూ రుక్మిణి మీద కోపంగా విరుచుకుపడ్డాడు కృష్ణుడు.

"అమ్మాయి ! యుద్ధాలు చేయడం, సంధి కుదుర్చుకోవడం ఇవన్నీ మగవాళ్ల వ్యవహారం. అంతఃపురంలో వుండవలసిన ఆడదానివి నీకెందుకమ్మా" అని మందలించాడు బలరాముడు.

"నన్ను తిడితే తిట్టారు – ఎన్నయినా పడతాను కానీ, అర్జునుణ్ణి కాపాడండి – చాలు" అని భోరుమని ఏడ్చేసింది రుక్మిణి.

"ఇప్పుడు నీ ఆలోచన ఎవరడిగారని చెప్పడానికి వచ్చావు –" అని మళ్ళీ కసురుకొన్నాడు కృష్ణుడు. "నీ లేతనవ్వులు, నీ ఒయ్యారాలు, నీ నేర్పులు, నీ విలాసాలు ఇవన్నీ కేళీమందిరంలోనే కాని, పగవాణ్ణి చెండాడే విషయంలో పనిచెయ్యవు – నీ సలహాలు చాలు–కట్టిపెట్టు. కృష్ణుడు స్త్రీలోలుడు – ఆడవాళ్ళు ఏంచెబితే అలా చేస్తాడని అనుకొంటున్నావేమో... నీ అభిప్రాయం తప్పు ..." అన్నాడు చాలా కటువుగా శ్రీకృష్ణుడు.

"అక్కర తీరేవరకూ బ్రతిమాలి, ఆ తర్వాత దాసికంటే హీనంగా చూస్తారు – మీ మగవాళ్ళని నమ్మకూడదు –" అని తిట్టుకొంటూ వెళ్ళిపోయింది రుక్మిణి.

రుక్మిణిని తిట్టి పంపించారని తెలిసి కూడా సత్యభామ అదే సాహసాన్ని చేయడం కోసం, ఆమెకూడా "మనం పార్థుడితో యుద్ధం మానుకోవాలని వేడుకోవడానికి వచ్చాను– " అంది.

"పార్థుడితో కాకుండా ఇంకే వ్యర్థుడితో యుద్ధం చెయ్యమంటావు ?" అన్నాడు కృష్ణుడు.

లేకపోతే, అంతఃపురంలో నీలాగా గాజులు తొడిగించుకొని కూర్చోమంటావా... సిగ్గూ ఎగ్గూ లేకుండా మాట్లాడుతున్నావేం ? అయినా నీకు సిగ్గెక్కడిది – మణిని ఎత్తుకుపోయాడని నామీద నేరం మోపిన సత్రాజిత్తు పుత్రికవి కదా... భర్తను నన్నే ఎడంకాలుతో తన్నిన దానివి కదా..." అంటూ కృష్ణుడు ఎడాపెడా సత్యభామని కేకలెయ్యడం మొదలుపెట్టాడు.

"ఈ మగాళ్ళ వ్యవహారాల్లో కలుగజేసుకోవడం నాదే తప్పు – మనసిచ్చినట్టు నటిస్తారు. మోసగాళ్ళు... " అని కోపంగా చిందులు తొక్కుకొంటూ వెళ్ళిపోయింది సత్యభామ !

వీళ్ళందరి తర్వాత అభిమన్యుణ్ణి వెంటబెట్టుకొని తల్లి దేవకీదేవి కృష్ణుణ్ణి కలుసుకోవడానికి వచ్చింది !

"లేకలేక కల్గిన చెల్లెలు సంసారం కూలదోస్తావా, అదీగాక పాండుపుత్రులు మేనత్తకొడుకులు గదా..." అని ఆవిడ కూడా కృష్ణుడికి నచ్చుజెప్పబోయింది.

"చుట్టరికం గురించి మాట్లాడవద్దమ్మా" అన్నాడు కృష్ణుడు. వాళ్ళు మేకవన్నె పులులు. తేనె పూసిన కత్తులు. పయోముఖ విషకుంభాలు... మేనత్త కొడుకులు కాదమ్మా..." అన్నాడు బాధగా !

"నాయనా ! అట్లా అనకు – లోకంలో బావలు, బావమరుదులు కన్నా ఆప్తులు వుండరు మనకి ! అలాంటి మరిది మీద నీకు ఆగ్రహం దేనికయ్యా !" అని సముదాయించబోయింది దేవకీమాత.

ప్రతివారూ వచ్చి తనకే నీతులు చెప్తుండటంతో వెర్రెత్తిపోతోంది శ్రీకృష్ణుడికి.

"అతనూ దుష్టుడు కాదు – నువ్వూ దుష్టుడివి కాదు – నీ కోపావేశం వలన అలా అనిపిస్తోందంతే..." అని తల్లి ఎంత చెప్పినా కృష్ణుడి ధోరణి మారలేదు. "నీకు కన్నకొడుకు కన్నా అల్లుడే ఎక్కువ అయ్యాడా ? కొడుకులు ఏమయి పోతేనేం... కూతురు, అల్లుడు వుంటే చాలా ?" అంటూ కృష్ణుడు దేవకీమాత విజ్ఞప్తిని తిరస్కరించాడు.

"మా నాన్నగారి మీదకే యుద్ధానికి వెడతావా మామయ్యా..." అన్నాడు ఖంగారుగా అభిమన్యుడు.

"ఒరే ! బుడతడా ! చూపులకి కుర్రాడివేగాని, బుద్ధికి కాదు – వాడికి కొడుకువేననిపించుకున్నావు. నీకన్నా మీనాన్నే నయమనిపిస్తోంది. ఎప్పుడో ... చిన్నప్పట్నుంచి పెంచాం కదా... నీ కృతజ్ఞత బాగానే చూపించావు –" అని అభిమన్యుణ్ణి చివాట్లు పెట్టాడు కృష్ణుడు.

ఇంక ఈ విషయంలో కృష్ణుడితో మాట్లాడే ధైర్యం చెయ్యలేకపోయారెవ్వరూ !

కృష్ణుడు రణభేరి మోగించాడు.

యదు, వృష్ణి, భోజ, సకురాంధక వంశోత్తంసులైన శూరాగ్రేశ్వరుల్ని దండ నాధులుగా నియమించాడు.

కత్తులు, బాణాలు, విల్లులు సిద్ధం చేయించాడు. ప్రద్యుమ్నుడు, సాత్యకి వీళ్ళందరినీ అతిరధులుగా నిమించాడు. పుష్కరుడు, కుంతిభోజుడు మహారథులుగా వుంటారన్నాడు. ఉద్ధవుడు, అక్రూరుడు సమరథులు అని చెప్పాడు. మిగిలినవారు అర్ధరథులుగా మెలగాలన్నాడు. ఈ మహాసైన్యానికి నువ్వే ప్రధాన సేనాధిపతివై వుండి నడిపించాలని బలరాముణ్ణి కోరాడు. వీళ్ళందరిని ద్వైతావనంలో పాండవ ఆశ్రమం దగ్గరికి నడిపించుకు రమ్మన్నాడు.

కలనైనా ఊహించలేదు ఈ కౌంతేయులతో విరోధాన్ని. కాలం ఎన్ని ఆశ్చర్యకరమైన మార్పుల్ని తెస్తుందో... అనుకొన్నాడు శ్రీకృష్ణుడు.

## 5

# ద్వైతవనం - పాండవుల ఆశ్రమం - దుర్యోధనుడిరాక - చుట్టుముట్టిన యాదవసేన

"సాక్షాత్తూ విష్ణువుతో సంధికుదుర్చుకోవడమా... ధర్మమా ఏది మఖ్యం అని ఆలోచిస్తే యుద్ధమే కర్తవ్యంగా కనిపిస్తోంది... ఈ అడవుల్లో వున్న కిరాతులంతా మనకు సాయం చేస్తామంటున్నారు" అని వివరిస్తున్నాడు ధర్మరాజు.


యమదండం లాంటి గద తన దగ్గర వుందని భీముడు; గాండీవము, పరమ శివుడు ప్రసాదించిన పాశుపతము తన దగ్గరున్నాయని అర్జునుడు చెప్పుకున్నారు.

మొత్తంమీద ఈ యుద్ధంలో తమ స్వశక్తిమీదే ఆధారపడాలని పాండవులు నిర్ణయించుకున్నట్లు అర్థం అవుతోంది.

పాండవులు ఇలాంటి స్థితిలో వున్నప్పుడు దుర్యోధనుడు మీకు సాయంగా నేనుంటానంటూ బయల్దేరి వచ్చాడు.

దుర్యోధనుడు, కర్ణుడు సహాయం చేస్తామంటే భీమార్జునులే కాదు - లోకంలో ఎవ్వరూ నమ్మరు కదా...

అర్జునుడు కృష్ణుడికి బహిఃప్రాణం అంటారు. కృష్ణుడు అర్జునుడికి అర్ధశరీరం అంటారు - వాళ్ళిద్దరి మధ్య యుద్ధం అంటే నేను ఛస్తే నమ్మను అని దుర్యోధనుడు



అనుమానించాడు. ఇలాంటప్పుడు కృష్ణుడి పక్షాన వుంటే, రేపు అరణ్యవాసం, అజ్ఞాతవాసం అయిపోయిన తర్వాత జరిగే యుద్ధంలో కృష్ణుడు పాండవులవైపు వెళ్ళకుండా నివారించగల్గుతాం కదా... అని కర్ణుడు ఓ ఆలోచన చెప్పాడు.

కానీ, పాండవుల పక్షాన నిలబడి, అర్జునుడి సాయంతో కృష్ణుణ్ణి సంహరిస్తే, ఆ తర్వాత ఈ పాండవుల్ని క్షణంలో నలిపేయవచ్చుగదా... అందుకని పాండవుల పక్షాన చేరితే ఒకే దెబ్బకి రెండు పిట్టలు రాల్తాయి – కృష్ణుడు మనల్ని రానివ్వకపోవచ్చు – కానీ, ధర్మరాజు అంగీకరిస్తాడు – ఎందుకంటే ఇప్పుడతనికి తోడు కావాలి –" అని దూరాలోచన చేశాడు దుర్యోధనుడు. ఈ ఆలోచనకే కౌరవులంతా మొగ్గుచూపడంతో, పాండవ శిబిరంవైపు రథాలు నడిపారు కౌరవులు.

"అన్నయ్యా ! జరిగిందేదో జరిగిపోయింది. పాత విషయాలు తవ్వుకొని ఏం ప్రయోజనం. ఆ రోజున ఘోషయాత్ర సమయంలో మీ అన్నదమ్ములు మాకు సహకరించి ప్రాణాలు కాపాడారు. అది గుర్తుపెట్టుకొని, ఇప్పుడు మీకు సాయపడాలని వచ్చాము. భీష్మాదులందరిని తీసుకొని వచ్చాను అన్నాడు దుర్యోధనుడు.

వీళ్ళిలా మాట్లాడుకొంటూ వుండగానే కృష్ణుడి సైన్యం పాండవుల ఆశ్రమాన్ని చుట్టుముట్టేసింది. ఇంక తర్కవితర్కాలకు సమయం లేదు. ఎవరికి వాళ్ళు ఆయుధాలు చేపట్టి యుద్ధానికి సన్నద్ధమయ్యారు.

కృష్ణుడు వస్తూనే కురుసేనని చూసి, "అయితే, గయుణ్ణి విడవరన్నమాటే గదా !" అని సూటిగా అడిగేశాడు.

"నేను రకరకాలుగా నిన్ను ప్రార్థిస్తున్నాను. సుభద్రతోనూ, అక్రూరుడితో కూడా కబురు పంపించాను. అయినా గయుణ్ణి క్షమించలేకపోయావుగదా –" అన్నాడు అర్జునుడు.

“ఈ కౌరవసంతతి భీముడికి విషంపెట్టి నిద్రపోతున్నవాణ్ణి నదిలోకి తోసేసినప్పుడు, వారణావతంలో మిమ్మల్నందరిని లక్కఇంట్లో పెట్టి ఈ కౌరవులు సజీవంగా తగలబెట్టాలని అనుకొన్నప్పుడు, నిండు సభలో ఈ యువరాజు పెద్దల సమక్షంలోనే మీ ఇల్లాల్ని బట్టలు వలిచినప్పుడు, రాజసూయం కోసం బృహద్రధుణ్ణి భీముడితో సంహరింపచేసినప్పుడు మీకు చుట్టాన్ని గాని, ఇప్పుడు చుట్టాన్ని ఎట్లా అవుతాను అర్జునా...” అని నిలదీశాడు కృష్ణుడు. “నాతో మీ అవసరం తీరిపోయిందయ్యా – కాబట్టి నన్ను నిరాకరిస్తున్నారు – ఏరుదాటి తెప్పతగలెయ్యడం కాదా ఇది...” అని ప్రశ్నించాడు.

“చేసిన ఉపకారాల్ని తలుస్తూ ఇలా మమ్మల్ని దెప్పిపొడవడం న్యాయమా ? మేం కృతఘ్నులమో కాదో ఈ ప్రపంచానికి తెలుసు. అయినా, జరుగుతున్నదేమిటో ముఖ్యం కాని, జరిగిపోయిన వాటి గురించి దేనికి – గతజల సేతుబంధనం !” అని ధీటుగానే జవాబిచ్చాడు అర్జునుడు.

“ఎంత ఉపకారివైనా, మిత్రుడివే అయినా, తగని పని చెయ్యమని నన్ను అడుగుతున్నావు – అరసి పాలిచ్చి పెంచిన అమ్మయినా, విషం పెడితే తింటాడా ప్రియపుత్రుడు –

నిజమే ! నువ్వన్నట్లు –

నీతో యుద్ధంచేస్తే కృతఘ్నుడిననే చెడ్డపేరొస్తుంది. నీతో యుద్ధం చెయ్యకపోతే అధర్మ పరుడనే చెడ్డపేరు కూడా వస్తుంది కదా ...” అని వాపోయాడు అర్జునుడు.

అప్పుడు కృష్ణుడు కొంచెం బుజ్జగించాడు అర్జునుణ్ణి !

“వాడెవడో అల్పుడి కోసం నాతో యుద్ధానికి తలపడినందువలన నీకు వచ్చే లాభాలన్నీ పోవడం లేదా ... ఈ సమయంలో గయుణ్ణి నాకు అప్పగించి, నన్ను మెప్పించు. ఈ భూమండలం మొత్తాన్ని నీకు పట్టం కట్టిస్తా. నిన్ను దేవదానవ మానవులందరిలో అసమాన చరిత్రుడిగా చేస్తాను – నీ మంచికోరి చెప్తున్నాను – నీ శ్రేయస్సు కోరుకునేట్లయితే, నేను చెప్పినట్లు చెయ్యి. సామ్రాజ్య సంపాదనే నిజమైన రాజధర్మం” అని నచ్చచెప్పబోయాడు.

అర్జునుడు విరాగంగా ఒక నవ్వు నవ్వాడామాటలకి ! “ఆరుగురు చక్రవర్తులు ఈ భూమండలాన్ని పాలించారు. 16 మంది మహారాజులు, మహేంద్రాదులు పాలించారు – వీళ్ళలో ఏ ఒక్కరైనా ఐశ్వర్యాన్ని మూటకట్టుకుపోయారా... రాజ్యాలు దేనికి ? వైభవాలు దేనికి... ధర్మం లేకుండా పోయినప్పుడు –” అన్నాడు –

“నిజంగా ఇంత విరాగివే అయితే, ఆరోజున రాజసూయాది మహాయాగాలు చేయడం దేనికి, రాజసంఘాల్ని వధించడం దేనికి ? వాళ్ళరాజ్యాలు కాజేయడం దేనికి ? అని ప్రశ్నించాడు కృష్ణుడు.

ఈ దెప్పిపొడుపులు ఇలా సాగుతూవుండగానే, కృష్ణుడే అన్నాడు – మనిద్దరం ప్రాణమిత్రులం అయితే, నా శత్రువు నీకు శత్రువు కాదా ? నాకు అవమానం జరిగితే నీకు కాదా ? నీ కష్టాలన్నీ నా కష్టాలుగా భావిస్తాను కదా ... నువ్వు మాత్రం ఇట్లా చేయవచ్చునా ? నేను చంపుతానన్నవాడికి నువ్వు శరణు ఇస్తావా ? మనిద్దరం కలిసి ఆ దురాత్ముణ్ణి వధించాలి కానీ, నువ్వు చేస్తోందేమిటీ –" అని సూటిగా అడిగాడు.

"నువ్వు చెప్పిందంతా నిజమే కృష్ణా ! కానీ, అధర్మానికే భయపడ్తున్నాను –" అన్నాడు అర్జునుడు.

"అధర్మం గురించి నువ్వు భయపడకు – నేను నీకన్నా వయసులో పెద్దవాణ్ణి కదా... పెద్ద వాళ్ళు చెప్పినట్లు చెయ్యడానికి ధర్మ విచారణ అవసరం లేదు – తల్లి తలని నరికేయమంటే ... ఎందుకూ, ఏమిటీ అనకుండా గండ్రగొడ్డలి తీసుకొని తల్లిని నరికి, తండ్రి ఆజ్ఞని పాటించిన పరశురాముడు నీకులాగా ధర్మ విచారణ చేశాడా ? చేయడం చేతకానివాడు కాదు గదా – ?"

తల్లి చెప్పిందని, ఆమె కొడుకులు తండ్రి దీర్ఘతమో మహర్షిని ఎత్తి నీళ్ళలో పారేశారు – ధర్మసూక్ష్మం అంటే – ఇదే !" అని వివరించాడు కృష్ణుడు.

అర్జునుడు ఈ అనునయ వాక్కులకు ఏమాత్రం మెత్తబడలేదు – "ఈ అధర్మ నిరతుల్ని ఆదర్శంగా తీసుకోవడం ఎలా ?" అన్నాడు.

నేనెన్ని విధాల చెప్పినా మూర్ఖత్వం వదలకుండా వున్నావు – మన పూర్వజన్మల గురించి నీకొక విషయం చెప్పాలి – బదరిక వనంలో అత్యంత నిష్ఠాగరిష్ఠులైన నరనారాయణులనే గొప్ప మహర్షులు ఇద్దరుండే వాళ్ళు. వాళ్ళలో నారాయణుడి అంశాన నేను పుట్టాను. నరుడు అంశాన నువ్వు పుట్టావు. యాదవ, పాండవ రాజవంశాలలో మనిద్దరం జన్మించాం. కావాలంటే చూడు" అంటూ అర్జునుడి రెండు కళ్ళని తుడిచాడు శ్రీకృష్ణుడు. పూర్వజన్మ వివరాలన్నీ అర్జునుడికి కళ్ళకుకట్టినట్టు కన్పించాయి.

అయినా, "ధన్యోశ్మి !" అన్నాడే గాని, అర్జునుడు గయుణ్ణి విడిచిపెట్టేందుకు ఏమాత్రం ఒప్పుకోలేదు.

నరకాసుర వధచేసిన విధానాన్ని కృష్ణుడతనికి వివరించాడు. "నీ చేతుల్లో మరణించడానికైనా సిద్ధమే" అన్నాడు అర్జునుడు.

అప్పుడు కృష్ణుడు గతంలో తాను ఎత్తిన అవతారాల్ని అర్జునుడికి మాత్రమే కన్పడేలా ప్రదర్శించాడు–

"దేవా ! శ్రీకృష్ణా !" అంటూ అంజలి ఘటించి నీ అనుగ్రహం వలన మహాయోగేంద్ర దుర్లభుడైన శ్రీమన్నారాయణ ప్రథమావతారం చూడగలిగే అదృష్టం నాకు దక్కింది –" అని మొక్కుకున్నాడు అర్జునుడు.

"మరి నా ప్రతాపజ్ఞానం నీకు కల్గింది కదా ! ఇకనైనా గయుణ్ణి విడుస్తావా ?" అనడిగాడు కృష్ణుడు.

"మధుసూదనా, నీ అవతార దర్శనానంతరం నాకు సమరోత్సాహం మరీ ఎక్కువ అవుతోంది. నిఖిల చరాచరుడివీ, పరాత్పరుడివీ - నిన్ను కయ్యంలో నిలిపి గెలిస్తే లోకత్రయంలో ఎవ్వరూ చెయ్యలేకపోయిన సాహసం చేసినవాణ్ణవుతాను - నిన్ను జయించలేక కూలిపోయాననుకో... నిన్నే తలుచుకొంటూ, కీర్తించుకొంటూ వీరస్వర్గాన్ని పొందుతాను - అంతేగాని గయుణ్ణి విడవను. ఎందుకంటే, అతను నిరపరాధి -" అన్నాడు అర్జునుడు.

"మూఢుడా ! గయుడు నిరపరాధి అయ్యేట్లయితే, అపరాధిని నేనౌతానా ? ఇలాంటి వాడివని తెలిస్తే నా చెల్లెల్ని నీకిచ్చి పెళ్ళి చేయకపోదును" అన్నాడు.

"ఈ మాత్రం గవ్వ కూడా దొరక్క ఆజన్మం బ్రహ్మచారిగా వుండిపోతాననుకున్నావా అన్నాడు వ్యంగ్యంగా అర్జునుడు.

"ఇంత కృతఘ్నుడివౌతావనుకొంటే, అనవసరంగా కౌరవులతో విరోధం పెట్టుకునేవాణ్ణే కాదు - ముందే జాగ్రత్తపడి వుండేవాణ్ణి" అన్నాడు కృష్ణుడు.

అర్జునుడు మళ్ళీ కృష్ణుణ్ణి ప్రార్థించాడు - గయుణ్ణి క్షమించమని ! "మహాసముద్రంలో పంచదార తెచ్చి కలిపినట్లు, బూడిద మీద పన్నీరు పోసినట్లు నా ప్రార్థనలన్నీ నిష్ఫలం చేస్తున్నావు కదా -" అని !

"ఓరోరీ పరాకమానల దుర్విదగ్ధా ! నీ దుర్వినయ ప్రసంగాలు చాలు చాలు !! గర్వాంధుడివైన నువ్వు నాకు బంధువుడివి కాలేవు - నీ ముఖం చూస్తేనే మహా పాతకాలు చుట్టుకొంటాయి - అవతలకి ఫో ... అంటూ అర్జునుణ్ణి ఒక తన్ను తన్నాడు శ్రీకృష్ణుడు.

"నీ పాదపద్మాలు నా కఠిన శరీరాన్ని తాకి ఎంత కందిపోయాయో... నీ చరణారవిందాల్ని నేను వత్తుతాను - అంటూ పాదాలు పట్టుకున్నాడు అర్జునుడు.

"సిగ్గులేదా ? ప్రతాపం చూపిస్తానంటూ వచ్చి పాదాలు పట్టుకొంటావు - ఇదేనా పౌరుషం !" అన్నాడు కృష్ణుడు.

"పరమశివుడిచ్చిన పాశుపతం వుంది - మరీ అంత చులకనగా మాట్లాడకు - " అని ఎదురు తిరిగాడు అర్జునుడు.

"నిండు మగతనం లేనివాడు - సగం ఆడమనిషి అయిన ఆ శంకరుడిచ్చిన అస్త్రంతో నన్ను బెదిరిస్తావా?" అని హేళనచేశాడు కృష్ణుడు.

"ఈ అర్జునుణ్ణి గెలవడం తుచ్ఛుడైన నరకాసురుణ్ణి గెలవడం అంత తేలిక అనుకోకు"

"అలా ఎందుకనుకొంటాను - భార్య బిడ్డల్ని పరాయివాడు వచ్చి వూడబీకుతుంటే, పౌరుషహీనంగా చూస్తూ నిలబడటం అనుకొంటాను -"

"అరణ్యవాసం తర్వాత కౌరవ నిర్మూలన చేసినప్పుడు మా ప్రతాపాల గురించి మాట్లాడు"

"అప్పటిదాకా ఎందుకు ? ఇప్పుడు నా నాలుగుచేతుల బారి నుంచి తప్పించుకొని బైటపడు"

"ఆ నాలుగు చేతులూ నాలుగు వేల మంది కామాతురులైన ఆడవాళ్ళని ఆలింగించుకోవడానికి అక్కరకు వస్తాయి కాని, చతుర్దశ విద్యలు నేర్చి, చాతుర్వర్ణ ధర్మ ప్రకారం నాలుగు సముద్రాల పర్యంతం వున్న ఈ భూమండలాన్ని పాలించే ఈ అర్జునుణ్ణి గెలవడానికి ఉపయోగించవు –" కృష్ణుడు హెచ్చరించిన ప్రతిసారీ అర్జునుడు ధీటుగా సమాధానం చెప్పసాగాడు.

"ముందు నిన్ను నా సుదర్శన చక్రంతో సంహరిస్తాను –" అన్నాడు కృష్ణుడు. నీ సుదర్శన చక్రానికి ధీటైన గాండీవం నా దగ్గర ఉంది – అని దాన్ని చేత్తో పట్టుకొన్నాడు అర్జునుడు.

"అడవి జంతువుల్ని చంపేందుకు విల్లుపట్టుకునే ప్రతివాడూ విలుకాడే..." అని దెప్పి పొడిచాడు కృష్ణుడు. గారడీవాడి చేతిలో పెనంలాంటి చక్రం ధరించిన నువ్వు, పొలందున్నుకునే వాడిలా నాగలి ధరించిన మీ అన్న నాకు భయం పుట్టించగలవారా ?" అని ఎదిరించాడు అర్జునుడు.

"మా అన్న పేరెత్తుతావా ? మా అన్న మీ అన్నలాగా జూదరి కాడు–" అని కృష్ణుడు ధర్మరాజుని కూడా కలిపి తిట్టాడు. "మీ అన్నదమ్ములు మా అన్నదమ్ములకు సాటిరారు" అనుకొన్నారిద్దరూ...

*"అల్లుడా! రమ్మని యాదరమున బిల్వ*
*బంపు మామను బట్టి చంపగలమె ... ?*
*జలకేళి సవరించు జవరాండ్ర*
*కోకల నెత్తుకపోయి చెట్లెక్కగలమే ?*
*ఇల్లిల్లూ తిరిగి వ్రేపల్లెలో మ్రుచ్చిలి*
*మిసిమి ముద్దలు తెచ్చి మ్రింగ గలమే ?*
*గొల్ల బొట్టెల గూడి కోల చేగొనియాల*
*కదుపుల నేర్పుతో గాయగలమె ...*
*తల్లిదండ్రులు పరులకాదలచు కానక*
*బలిమిమై దెచ్చి భార్యగా బడయగలమే !*
*దుష్టులను వంక వీరులండ్రుంపగలమే*
*అనపరాధుల దండింపనరుగ గలమే ?*

మీరు చేసిన పనులన్నీ మేమెట్లా చెయ్యగలం ... అల్లుడా ! రా ! అని ప్రేమతో పిలిచిన మేనమామని పట్టుకొని మేము చంపగలమా ?

నదిలోకి దిగి స్నానాలు చేస్తున్న ఆడపిల్లల బట్టల్ని ఎత్తుకుపోయి చెట్లెక్కగలమా ?

ఇంటింటా దొంగలా దూరి, వ్రేపల్లెలో వెన్నముద్దలు తెచ్చి మింగగలమా ?

గొల్లవాళ్ళ కుర్రాళ్ళలో చేరి, చర్నాకోల పట్టుకొని ఆవుల్ని మేపుకు రాగలమా ?

తలిదండ్రులు ఎవరో అబ్బాయికి ఇవ్వాలని తమ కూతురికి పెళ్ళిసంబంధం నిశ్చయం చేసుకొంటే, ఆ పిల్లని ఎత్తుకొచ్చి పెళ్ళాడగలమా ?

దుష్టుడని పేరు పెట్టి ప్రతి వీరుణ్ణి చంపగలమా ?

ఏ నేరమూ చెయ్యనివాణ్ణి చంపుతానంటూ ఇలా బయల్దేరగలమా ? అని ఎద్దేవా చేశాడు అర్జునుడు.

కృష్ణుడు తను పాండవులకు చేసిన ఉపకారాల్ని ఏకరువు పెట్టి, మా విశ్రమ లీలలు నీకు అవహేళనగా కన్పిస్తున్నాయా ? అనడిగాడు.

"మీకు మయసభ ఇప్పించింది నేను" –

"అదిచూసి కన్నుకుట్టే ఈ దుర్యోధనుడు మమ్మల్ని అడవులపాలు చేశాడు –"

"అంటే నీకేఉపకారమూ చేయలేదంటావా !"

"చేశావు కాబట్టే ఈ కష్టాలు. ఏ ఉపకారమూ చేయకుండా వుంటే, మా మానాన మేము బతికే వాళ్ళమేమో ..."

"అట్లా అయితే, గయుణ్ణి విడవనంటావు?"

"విడవను"

"చావడానికే నిశ్చయించుకున్నావా ?"

"యుద్ధం చెయ్యకుండానే జయాపజయాల నిర్ణయం నువ్వెట్లా చేస్తావు ?"

"చెడిపోతావని చెప్తున్నా నా మాటలు తోసేసి ఇలా బింకాలుపోతున్నావు – వీరరణంలో చూడు ఇంక ... ఒక్క క్షణంలో కృష్ణుడు ఎంత నిర్దయుడో తెలిసొస్తుంది ! చివరిసారి నిన్ను బతిమాలుకొంటున్నాను – గయుణ్ణి వదులు" అన్నాడు కృష్ణుడు.

"గయుణ్ణి నీకప్పగించి మహానరకాన్ని పొందేందుకు నా మనసు అంగీకరించదు" అని తేల్చిచెప్పాడు అర్జునుడు.

"అట్లా అయితే ఈ దెబ్బ కాచుకో – అంటూ ఒక చేత్తో సుదర్శన చక్రాన్ని, ఇంకో చేత్తో కత్తిని పట్టుకొని అర్జునుడి మీద కత్తివేటు వేశాడు కృష్ణుడు.

అర్జునుడు ఆ దెబ్బ తప్పించుకొని, "బావా ! నీ వ్రేటు ఏమైందీ" అంటూ హేళనగానవ్వి రెచ్చగొట్టాడు.

"ఇదిగో ఈసారి చూడు –" అని ఇంకో వ్రేటు వేశాడు కృష్ణుడు.

మళ్ళీ తప్పించుకున్నాడు అర్జునుడు.

"బావా ! అపజయం నీదే ... ఓడిపోయినట్టు ఒప్పుకో –" అని నవ్వాడు అర్జునుడు.


"ఈసారి చూడు – నువ్వు చచ్చినట్టే ..." అని గట్టిగా కత్తివ్రేటు వేశాడు. దెబ్బకి అర్జునుడు మూర్ఛపోయాడు.

కృష్ణుడు స్వయంగా తన బావగారిని ఇలా చంపవలసి వచ్చినందుకు చాలా బాధపడ్డాడు. ఇప్పుడు తన కర్తవ్యం... ముందు గయుణ్ణి సంహరించడం ...

"ఓరోరీ... గయుడా ! ఇదిగో చచ్చావు –" అంటూ గయుడి వెంటపడ్డాడు. అంతలో అర్జునుడు తెప్పరిల్లి స్పృహలోకి వచ్చాడు. "కృష్ణా ! ఆగు !! ఆగు !!! అంటూ అర్జునుడు కృష్ణుడి వెంట పరిగెత్తాడు.

అర్జునుడు మళ్ళీ లేచినందుకు కృష్ణుడు సంతోషించాడు. కానీ, ఇంత త్వరగా లేవకుండా గట్టిగా కొట్టి వుండాల్సిందనుకున్నాడు.

"మాధవా ! ఇదిగో కాచుకో –" అని బాణం వేశాడు అర్జునుడు.



"ఆ బాణం దెబ్బకి కృష్ణుడు మూర్ఛపోయాడు. కృష్ణుడు పడిపోయేసరికి అర్జునుడికి ఖంగారు అయ్యింది – ఆహాహా ! ఈ క్షాత్రం ఎంత నిష్ఠూరం అయ్యింది – కృష్ణుడినే నాచేత చంపించింది కదా... హో! మాధవా ! ..." అంటూ కృష్ణుడిమీదపడి అర్జునుడు రోదించాడు. ఒక కంచంలో తిని ఒక మంచంలో పడుకొన్న వాళ్ళం మనిద్దరం – చస్తే ఇద్దరమూ ఒకేసారి చచ్చిపోవాలి ... ఇదిగో నేను కూడా నీతోనే వస్తున్నాను – గయుణ్ణి రక్షించానన్న సంతృప్తి నాకుంది. ఈ జన్మకిది చాలు–" అంటూ ఆత్మహత్య చేసుకోబోయాడు అర్జునుడు.


కృష్ణుడు తెప్పరిల్లి ..." గయుడా ! ఆగు ఆగు ... అర్జునా ! ఎక్కడికి పోతావు – తప్పించుకోలేవు –" అని అరవడం మొదలుపెట్టాడు.

అప్పుడు కృష్ణుడి ఎదురుగా వచ్చి నిలబడ్డాడు అర్జునుడు. కోరినట్లు గయుడు బతికాడు. కానీ, మన ఇద్దరి మధ్యన కలహం పూర్తికాలేదు. ముందు నన్ను సంహరించు. తర్వాత గయుడిని వెదుకు –" అని కృష్ణుణ్ణి నిలువరించాడు అర్జునుడు.

ఇద్దరిమధ్యా భీకరయుద్ధం కొనసాగింది. భూలోకం తల్లడిల్లిపోయింది నరనారాయణుల సమరానికి !

సమస్త జీవరాశులూ అల్లకల్లోలం అయ్యాయి. ఈ యుద్ధాన్ని ఇక్కడితో ఆపాలి – అనుకొన్నాడు మహాశివుడు.

"అర్జునా ! ఆగు ! నారాయణా ! శాంతించు" అంటూ ఇద్దరిమధ్య వచ్చి నిలబడ్డాడు శంకరుడు.



"మహాదేవా ! అర్జునుడు, గయుడు చేసిన తప్పులు క్షమించరానివి – అనుగ్రహించి నన్ను వదిలెయ్ ... నేను ఈ ఇద్దరినీ శిక్షించి తీరాలి –" అన్నాడు కృష్ణుడు.

"ఓ భూతనాథా ! ఇందులో మా తప్పేమీ లేదు – తప్పంతా కృష్ణుడిదే –..." అన్నాడు అర్జునుడు.

"కాదు – తప్పు మీ ముగ్గురుదీ" అన్నాడు శంకరుడు.

"నేలమీద ఎవరున్నారో చూసుకోకుండా ఉమ్మేయడం గయుడి తప్పే ! తెలియకుండా తప్పు చేసిన వాణ్ణి చంపాలనుకోవడం నీ తప్పు – ముందు వెనకాల చూడకుండా అడిగిందే తడవుగా ఎవరికిపడితే వాడికి అభయం ఇవ్వడం ఈ అర్జునుడి తప్పు –" అని కృష్ణార్జునులిద్దరినీ సముదాయించాడు మహాదేవ శంకరుడు.

"శరణు మృత్యుంజయ !" అంటూ శంకరుని పాదాలమీద పడ్డాడు గయుడు. అతణ్ణి భయపడవద్దంటూ లేపి, "దేవా ! ఈ గయుడు నీ పరమభక్తశ్రేణిలో చేరినవాడే ! నువ్వు కాపాడదగిన వాడే ! ఈ అర్జునుడు నీ మనిషి ! నీవాడు" అని ముగ్గురిమధ్య స్నేహం కుదర్చాలని ప్రయత్నించాడు శంకరుడు.

"కానీ, ఆరోజున ఈ దుర్మార్గుణ్ణి వధించలేకపోతే, దేవకీదేవికి, వసుదేవుడికి పుట్టిన వాణ్ణే కాదని భీకర ప్రతిజ్ఞ చేశాను. దానికి పరిహారం ఎట్లా ?" అని సందేహంగా అడిగాడు కృష్ణుడు.

శంకరుడు ఈ కృష్ణుడి సందేహానికి పెద్దగా నవ్వాడు.

నారాయణా ! నువ్వు స్వయంభువుడివి. దేవకీ సుతుడివెట్లా అవుతావు – నీపాన్పు అయిన నాగరాజే ఈ బలరాముడు. అంతేగాని, ఆయన నీకు నిజంగా అగ్రజుడేమీ కాదు – నిన్ను కొలిచేందుకు పుట్టిన దేవతలే గాని, ఈ వీరులంతా యాదవులు కారు.

మామూలు నరుడిలా నడుస్తున్నావుగాని ధరణి భారాన్ని మాన్పగల అవతారాలు దాల్చే హరివే నువ్వు – ! యాదవుడివి కాదు – మాధవుడివి –!!

అంటూ క్షీరసాగర దృశ్యాన్ని శ్రీకృష్ణుడికి చూపించాడు పరమశివుడు.

అప్పటికి శాంతించాడు శ్రీకృష్ణుడు. తను గయుణ్ణి చంపుతానని భీకర ప్రతిజ్ఞ చేసిన శ్రీకృష్ణుడు గయుణ్ణి క్షమించి వదిలేస్తే ప్రతిజ్ఞ భంగం కాదని... ఈ లోకాన్ని మొత్తాన్ని క్షమించి కాచగల పరమాత్మ ఆయనేననీ సందేహనివృత్తి చేశాడు పరమశివుడు.

శ్రీకృష్ణుడు పరమేశ్వరుని స్తుతించాడు.

అర్జునుడు పరమేశ్వరుడూ, శ్రీకృష్ణుడూ ఇద్దరినీ స్తుతించాడు.

*సీ:* *విషము మెక్కిన వాని మిసిమి మెక్కినవాని*
*భజియింపగల మహాభాగ్యమొదలె*
*గరిదాల్చువాని మకరి గూల్చువానిని*
*సేవింపగల మహాశ్రీ లభించె*
*జన్మ చేలము వాని భర్మచేలము వాని*
*వినుతింపగల మహావిభవమబ్బె*
*తెల్లమేన్గలవాని నల్లమేన్గలవాని*
*బూజింపగల గొప్ప వున్నెమొదలె*

*ఆ:* *నెద్దునెక్కు వాని గ్రద్దనెక్కెడు వాని*
*సోమధరుని హరుని కామగురుని*
*గన్నులార జూచు కలిమి మాకొనగూడె*
*నొక్కనెలవు నందు నొక్కమాఱె ...*

అంటూ హరిహరులిద్దరినీ ఒకేసారి కీర్తించాడు అర్జునుడు.

సచ్చరిత్రులైన మీ అందరికీ అభ్యుదయమే కలుగుతుందని ఆశీర్వదించాడు శంకరుడు. శంకరాశీర్వచనం అమోఘం అని ఆశీర్వదించాడు శ్రీకృష్ణుడు !

★ ✪ ★